



# కరపత్రం

SINCE 2014

మంగళవారం ఏప్రిల్ 08 2025 | సంపుటి :0 | సంచిక :176 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


# గుజరాత్ కు సీఎం రేవంత్..

## రెండురోజుల పాటు ఏఐసీసీ కీలక సమావేశాలు



- గుజరాత్ కు సీఎం రేవంత్.. రెండురోజుల పాటు ఏఐసీసీ కీలక సమావేశాలు
- అహ్మదాబాద్ లో రెండురోజుల పాటు ఏఐసీసీ కీలక సమావేశాలు
- రేపు హాజరుకానున్న ముఖ్యమంత్రి
- ఇవాళ సాయంత్రమే బయలుదేరనున్న డిప్యూటీ సీఎం, మంత్రులు

హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి గుజరాత్ లో పర్యటించనున్నారు. అహ్మదాబాద్ లో రేపు, ఎల్లుండి ఏఐసీసీ కీలక సమావేశాలు జరగనున్నాయి. ఈమీటింగ్ లో పాల్గొనేందుకు రేపు ఆయన అహ్మదాబాద్‌కు వెళ్లనున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, పలువురు కీలక నేతలు ఇవాళ సాయంత్రమే బయలుదేరనున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నుంచి మొత్తం 44 మంది నేతలకు ఆహ్వానం అందింది. జాతీయస్థాయిలో పార్టీ అనుసరించాల్సిన విధానాలు, వ్యూహాలపై చర్చిస్తారని సమాచారం. ఈ సమావేశాల్లోనే కులగణన సర్వే, బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణపై సీఎం రేవంత్?వివరించనున్నారు.

### భాజపా నేతలు తెలంగాణకు ఏం చేశారో చెప్పాలి: మహేశ్ కుమార్ గౌడ్

భాజపా నేతలు తెలంగాణకు ఏం చేశారో చెప్పాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు.



హైదరాబాద్: భాజపా నేతలు తెలంగాణకు ఏం చేశారో చెప్పాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా 8 స్థానాల్లో గెలిస్తే.. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన నిధులు మాత్రం సున్నా.. అని విమర్శించారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు. "దేశంలో రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ మెట్రో తొమ్మిదో స్థానానికి పడిపోయింది. మెట్రోకు నిధులు అడిగితే ఇవ్వడం లేదు. మూసీ పునరుజ్జీవానికి నిధులు అడిగితే రూపాయి ఇవ్వలేదు. విభజన చట్టంలోని హామీల గురించి కేంద్ర మంత్రులు ఏనాడైనా మాట్లాడారా? మతతత్వ రాజకీయాలను తెలంగాణ ప్రజలు సహించరు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లను ఆమోదించేందుకు కేంద్రాన్ని ఎందుకు అడగటం లేదు? గుజరాత్‌లో ముస్లింలకు రిజర్వేషన్ కల్పించడం లేదా? తెలంగాణ ప్రాజెక్టుల గురించి భాజపా నేతలు ఒక్కసారి కూడా మాట్లాడలేదు. తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వానిది సవతితల్లి ప్రేమ. భారాస, భాజపా మధ్య ఎప్పుడూ రహస్య బంధం ఉంటుంది. పదేళ్ల పాలనలో భారాస వేల ఎకరాలు అమ్ముకుంది. అప్పుడు ఎందుకు మాట్లాడలేదు?గత ప్రభుత్వ లక్ష ఎకరాలు డీఫారెస్ట్ చేస్తే ఎందుకు ప్రశ్నించలేదు?" అని నిలదీశారు.

### కొందరు అధికారులే నిజమైన అంధులు: జస్టిస్ నగేష్ భీమపాక



హైదరాబాద్: తెలంగాణ దివ్యాంగుల శాఖ అధికారుల తీరుపై హైకోర్టు జడ్జి జస్టిస్ నగేష్ భీమపాక తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంధులను కోర్టుల చుట్టూ తిప్పించడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. కొందరు అధికారులే నిజమైన అంధులని ఆయన వ్యాఖ్యానించారు. అన్యాయంగా ఉద్యోగాల నుంచి తొలగించారని కొందరు అంధ ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. వేరువేరు కారణాలతో తొలగించడంపై 8 ఏళ్లుగా వారు న్యాయపోరాటం చేస్తున్నారు. వారంతా కోర్టుల చుట్టూ తిరగడానికి కారణమైన అధికారులపై విచారణ సందర్భంగా న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికారుల తీరుతో కొందరి అంధుల ఉద్యోగ జీవితం మసకబారుతోందని ధర్మాసనం పేర్కొంది.



### యువతకు సాఫ్ట్‌స్కిల్స్‌ట్రైనింగ్

- మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు.
- పరిశ్రమలతో భాగస్వామ్యంతో కోర్సుల రూపకల్పన జరగాలని సూచించారు.
- డిమాండ్ ఉన్న కోర్సులపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు.
- గ్రామీణ యువతకు ప్రత్యేకంగా సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ ఇవ్వాలని అన్నారు.

అవసరాలకు అనుగుణంగా నైపుణ్య మానవ వనరులుగా తీర్చిదిద్దుతాం:మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

హైదరాబాద్: పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతను అన్ని రంగాల్లో అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులుగా తీర్చిదిద్దుతామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ ఆఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈఎస్‌ఐసీ)లో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం యూనివర్సిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులకు చిరునామాగా తెలంగాణను మార్చాలనే సంకల్పంతోనే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. పేజి 2లో

## హెచ్‌సీయూ విద్యార్థులపై కేసులను వెంటనే ఉపసంహరించండి



హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పోలీసులను ఆదేశించారు. [illegible] సచివాలయంలో హెచ్‌సీయూ టీచర్స్ అసోసియేషన్, సివిల్ సొసైటీ గ్రూప్స్‌తో, సబ్ కమిటీ సభ్యులైన మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటితో చర్చించిన అనంతరం భట్టి ఈ నిర్ణయం తీసుకున్నారు. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఇద్దరు విద్యార్థులకు సంబంధించి కేసుల ఉపసంహరణకు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీస్ అధికారులకు తగు సూచనలు చేయాల్సిందిగా న్యాయశాఖ అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు.

## 10 సెకన్లలో రూ.20లక్షల కోట్లు ఉఫ్..

### మార్కెట్లకు ఎందుకింత 'బ్లడ్‌బాత్'..?



2లో

## జీఆర్ఎంబీ సమావేశం..

### గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై చర్చ

- రాష్ట్రాల అనుమతి లేకుండానే సమావేశాలు నిర్వహించడం.
- డిప్యుటేషన్‌పై ఉన్న అధికారులను వేధించడం,
- మహిళా ఉద్యోగులను అసభ్యంగా దూషించడం అనే ఆరోపణలు చేశారు.




2లో

### కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై హైకోర్టులో ప్రభుత్వం పిటిషన్



2లో

గచ్చిబౌలి భూముల వ్యవహారంపై హైకోర్టులో తెలంగాణ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది.

నకిలీ వీడియోలు, ఆడియోలు కృత్రిమ మేధ సాయంతో తయారు చేసి ప్రచారం చేశారని పిటిషన్‌లో పేర్కొంది.

# సంపాదకీయం

## ఈ 'రీల్స్' రోజుల్లో 'యులీసిస్' చదవగలమా!

ఆధునిక సాహిత్యంలో అత్యంత ముఖ్యమైన, సంక్లిష్టమైన రచనగా పరిగణించబడే జేమ్స్ జాయిస్ 'యులీసిస్' నవలను మొదట చాలామంది పబ్లిషర్లు తిరస్కరించారు. తర్వాత 1922లో పారిస్ లోని 'షేక్‌స్పియర్ అండ్ కంపెనీ' యజమాని సిల్వియా బీచ్ ప్రచురించారు. కానీ అశ్లీలత పేరిట ఈ నవలను త్వరలోనే నిషేధించారు. యు.ఎస్. పోస్టల్ సర్వీసు ఏకంగా నవల కాపీలను తగలబెట్టింది. కథాపరంగా చూస్తే 'యులీసిస్'కు ఎటువంటి ప్రత్యేకతలూ లేవు. అతి సాధారణమైన కథను జాయిస్ ఎలా చెప్పారన్నదే దీని ప్రత్యేకత.డబ్లిన్ నగరంలో కొందరు సాధారణ వ్యక్తుల జీవితంలో ఒకే ఒక్క రోజు (1904 జూన్ 16న), సుమారు 18 గంటలపాటు, జరిగే సంఘటనలను కథగా రాసుకొచ్చారు జేమ్స్ జాయిస్. దైనందిన వ్యవహారాల్లోను, మామూలు సంభాషణల్లోను 'ఆర్ట్'ను ఆయన ఎంత వైవిధ్యంగా చూపగలిగారన్నదే ఈ నవల ప్రత్యేకత. నిజానికి ఇప్పటి ఓటీటీ వెబ్ సిరీస్లు, సినిమాలూ, పుస్తకాల్లో కనిపించేంత అశ్లీలత ఈ నవలలో లేదు. అందువల్ల నేటి పాఠకుడికి ఈ పుస్తకంలో షాక్ వేల్యూ పెద్దగా ఏమీ కనిపించదు. కానీ ఆనాటి మతవిశ్వాసాలనూ, సాంఘిక నియమాలనూ సవాలు చేసిన ఈ నవలకు అప్పటి వ్యతిరేకతను అర్థం చేసుకోవచ్చు.సాహిత్యంలో 'స్ట్రీమ్ ఆఫ్ కాన్షియస్‌నెస్' కథనాలు కొత్తేమీ కాదు. ఉదాహరణకు జులియన్ బార్నెస్ 'ది సెన్స్ ఆఫ్ ఆన్ ఎండింగ్', థామస్ బెర్న్‌హార్డ్ 'ది లూజర్' వంటి నవలల్లో కథంతా ఒకే ఒక్క ముఖ్య పాత్ర తన స్వగతం చెప్పుకుంటున్నట్లు రాశారు. టాల్‌స్టాయ్ 'అన్నా కరెనినా', ఇటీవల నోబెల్ ప్రైజ్ గెలుచుకున్న హాన్ కాంగ్ 'ది వెజిటేరియన్' లాంటి నవలల్లో రెండు లేదా అంతకంటే ఎక్కువ పాత్రల స్వగతాలను ఒక్కొక్కరి దృష్టి కోణం నుంచీ విడదీసి చెబుతారు. ఇప్పుడు జాయిస్ వచనాన్ని పరిశీలిస్తే%–% ఉత్తమ, మధ్యమ, ప్రథమ పురుష– ఈ మూడు రకాల నేరేటివ్‌లూ కథలో ఏ విధమైన క్రమమూ లేకుండా ఒకదాన్నొకటి ఢీ కొడుతూనే ఉంటాయి. అందువల్ల 'యులీసిస్' వచనమంతా అనేక పాత్రల ఆలోచనల అంతర్వాహిని అస్తవ్యస్తంగా పెనవేసుకుని చిక్కులు పడిపోయినట్లుంటుంది.

కథలో లియోపోల్డ్ బ్లూమ్, స్టీఫెన్ డెడలస్, మోలీ వంటి ముఖ్య పాత్రలతో బాటు కథ మధ్యలో వస్తూ పోతూ ఉండే ఇతరత్రా పాత్రల 'స్ట్రీమ్ ఆఫ్ కాన్షియస్‌నెస్' కూడా కలగాపులగంగా కలిసిపోయి, జాయిస్ వచనాన్ని పాఠకులకు ఓ పట్టాన కొరుకుడు పడనివ్వదు. పాఠకుడికి ఒక సన్నివేశం ఎలా మొదలవుతుందో, ఎవరు, ఎప్పుడు, ఎక్కడ మాట్లాడడం మొదలు పెట్టారో, సంభాషణ ఎప్పుడు ముగించారో స్పష్టత ఉండదు. వాక్యాల చివర ఫుల్‌స్టాపులూ, కామాలూ ఉండవు. రెండు మూడు పేజీలు పూర్తయినా ఒక్కోసారి వాక్యం ముగింపు కానరాదు. ఇక చివరి అధ్యాయం 'పెనెలోపె'లో అయితే మోలీ అనే పాత్ర స్వగతంగా మొదలైన ఒక వాక్యం మొదట్నుంచి చివరి వరకూ ఆగకుండా అనంతమైన ప్రవాహంలా సాగుతూనే ఉంటుంది. ఏదేమైనా ఐరిష్ సంస్కృతి గురించీ, జేమ్స్ జాయిస్ శైలి గురించీ కనీస అవగాహనలేని సగటు పాఠకుడిని చెయ్యి పట్టుకుని 'యులీసిస్' ఏరు దాటించే 'డిజిటల్ సాయాలు' ఇప్పుడు పబ్లిక్ డొమైన్‌లో అనేకం అందుబాటులో ఉండడం వల్ల ఈ నవల చదవడం ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు తేలికే.నిర్దిష్టమైన మూలం, నేపథ్యం ఉండే ఇద్దరి మధ్య సంభాషణ, వాటి నేపథ్యం తెలియని మూడో వ్యక్తికి అర్థం కాదు. జాయిస్ నవల ఇటువంటి ఒక 'ఇన్‌సైడ్ జోక్' లాంటిది. ఎటొచ్చీ 'యులీసిస్' రాయడం ద్వారా జాయిస్ ఏ ఒక్క వ్యక్తినో గాక మొత్తం ప్రపంచాన్ని తన సంభాషణలో భాగంగా చేసుకునే ప్రయత్నం చేశారు. 'యులీసిస్' శిల్పానికి ఫ్రేమ్ వర్క్‌గా తీసుకున్న హోమర్ కావ్యం 'ఒడిస్సీ' చదివితే ఈ నవల చదవడం తేలికవుతుంది అంటారు కొందరు. కానీ అది అర్ధసత్యం మాత్రమే. కథాపరంగా ఒడిస్సీకీ, యులీసిస్‌కీ పొంతనలుండవు. కానీ జాయిస్ తన స్నేహితులకు ఇచ్చిన 'గిల్బర్ట్ స్కీమా దయాగ్రమ్'లో ప్రతీ అధ్యాయానికీ 'ఒడిస్సీ' నేపథ్యమేమిటో చెప్పే లంకెలుంటాయి.నవల మొదటి 10 ఎపిసోడ్ల వరకూ విపరీతమైన పాండిత్య ప్రకర్ష ప్రదర్శించినా, 'సైరెన్స్' ఎపిసోడ్ మొదలు హాస్యం, వ్యంగ్యం, పేరడీలతో జాయిస్ పామరుల కోసమే ప్రత్యేకించి రాస్తున్నారనిపించేంతగా, కఠినమైన వచనాన్ని కొమ్ములు వంచి ఉన్న పళంగా 180 డిగ్రీల మలుపు తిప్పుతారు జాయిస్. ఆయన వచనం ఆయన సృష్టించిన అనేక పాత్రల వెనక ఎక్కడో నక్కి పాఠకుడితో నర్మగర్భంగా దాగుడుమూతలు ఆడుతున్నట్లు ఉంటుంది. ఆయన తన గురించి ఎన్నో వివరాలను గుక్కతిప్పుకోకుండా చెప్పీచెప్పనట్లు చెబుతూనే, చివరి వరకూ పాఠకుడికి దూరంగా, ఒక అపరిచిత వ్యక్తిగానే మిగిలిపోతారు. జాయిస్ వచనంలో అందరికీ అర్థంకావాలనే ఉబలాటం కనపడదు. "నా గురించి తెలియాలంటే నా ప్రపంచాన్ని నువ్వే ప్రయత్నపూర్వకంగా తెలుసుకోవాలి" అనే కళాకారుడికి ఉండే సాధికారత, అహంకారం జాయ్స్ వచనంలో అణువణువునా కనిపిస్తుంది.జాయిస్ శైలిలో మనకు నవలంతా స్థిరంగా కనిపించే ఒకే ఒక్క నియమం–%–% ఏ నియమాలూ లేకపోవడమే! మొదటి మూడు చాప్టర్లలో చాలా పకడ్బందీగా కనిపించే వాక్య నిర్మాణం తరువాత చాప్టర్లలో పూర్తిగా వీగిపోతుంది. ఇక్కడ నుండీ పాండిత్య ప్రకర్ష తగ్గి జాయిస్ అసలుసిసలు "%ఖీశీబశ్రీ జూశ్రీఘఎ%" మొదలవుతుంది. ఇక్కడ నుండీ జాయిస్ వాక్యనిర్మాణపు సంప్రదాయాలకూ, నవలా రచన విధివిధానాలకూ పూర్తి తిలోదకాలిచ్చేస్తారు. ఇక 11వ భాగం 'సైరెన్స్'కి వచ్చేసరికి జాయిస్ స్వరంలోని 'గూఫీ టోన్' తారాస్థాయికి చేరుకుంటుంది. 'Bronze by gold heard the hoofirons, steelyrining im- perthnthn thnthnthn అనే వాక్యాలు చదివిన ఎజ్రా పౌండ్ "జాయిస్ తలకు ఏదైనా బలమైన దెబ్బ తగిలిందేమో" అని కలవరపడ్డారంటేనే మనం ఊహించుకోవచ్చు. ఈ నవల నైతిక విలువలనూ, సభ్యతనూ మాత్రమే కాదు, కాల్పనిక సాహిత్య సంప్రదాయాలన్నిటినీ కూకటివేళ్ళతో పెకలించివేస్తుంది. జాయిస్ వచనం కొన్నిచోట్ల ఐరిష్, బ్రిటిష్ రైమ్స్, దేశవిదేశీ కవిత్వం, చరిత్ర, సాంస్కృతిక అంశాలతోనూ, మరికొన్ని చోట్ల వాటికి పూర్తి భిన్నంగా gibberishభాషలో అతి సామాన్యమైన, ఒకింత అర్థంపర్థం లేని సంభాషణలూ, పారడీలతోనూ ఎగుడుదిగుడు రోడ్ల మీద పడుతూ లేస్తూ చేసే ప్రయాణాన్ని తలపిస్తుంది. సాధారణంగా ఆనాటి రచయితలు వాడని అసభ్య భాషని పచ్చిగా ఉన్నదున్నట్లుగా ఎందుకు వాడారని ఎవరో అడిగితే– "ఈ జాతి, ఈ దేశం, ఈ జీవితం నన్ను మలిచాయి– నేను ఎలాంటి వాడినో అలాగే నన్ను వ్యక్తం చేసుకుంటాను" అని సమాధానం ఇచ్చారు జాయ్స్.ఐదువందల పేజీల పుస్తకాన్ని అరగంట నిడివికి కుదించే వెబ్ సిరీస్‌లూ, అంతకంతకూ క్షీణించిపోతున్న మన అటెన్షన్ స్పాన్‌ని సూచించే అర నిముషం వీడియోలు– ఇవన్నీ కలగలసిన 'ఇన్‌స్టంట్' సంస్కృతిలో 'యులీసిస్' లాంటి నవలను చదవడం మెదడును రీవైర్ చెయ్యడం లాంటిది. మొండి పశువు కొమ్ములు బలవంతంగా వంచడం లాంటిది. ఇలాంటి నవలలు మనం నేర్చుకున్నదంతా వదిలించుకుని మళ్ళీ పూర్వపు విద్యార్థిగా మారే అవకాశమిస్తాయి. ముఖ్యంగా జాయిస్ వాడిన ఐరిష్ యాసతో కూడిన పక్కా లోకల్ భాష మనకి ఇంగ్లీష్ మీద మంచి పట్టు ఉందనే నమ్మకాన్ని తునాతునకలు చేసిపారేస్తుంది. మార్కస్ జూసాక్ నవల 'బుక్ థీఫ్'లో లీసెల్ మెమింగర్ చిన్నప్పుడు చదవడం నేర్చుకుంటున్నప్పుడు ఒక్కో అక్షరాన్నీ కూడబలుక్కుంటూ పదాలను పేర్చుకోవడం గురించి రాస్తారు.

## 10 సెకన్లలో రూ.20లక్షల కోట్లు ఉఫ్.. మార్కెట్లకు ఎందుకింత 'బ్లడ్‌బాత్'..?

మొదటిపేజీ తరువాయి

ముంబయి: ట్రంప్ టారిఫ్ బాంబ్‌తో నెలకొన్న మాంద్యం భయాలు.. ప్రపంచ వాణిజ్యయుద్ధ ఆందోళనలు భారత స్టాక్ మార్కెట్ల ను ముంచేశాయి. కనివినీ ఎరుగని రీతిలో దేశీయ సూచీలు కుప్పకూలాయి. కేవలం 10 సెకన్ల వ్యవధిలోనే మదుపర్ల సంపద ఏకంగా రూ.20లక్షల కోట్ల మేర ఆవిరైందంటే.. మార్కెట్ల పతనం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

ట్రేడింగ్ ఆరంభంలో సెన్సెక్స్ 3,939.68 పాయింట్లు (5.22శాతం) కుంగింది. ఆ సమయంలో బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.20,16,293.53 కోట్లు తగ్గి.. రూ. 3,83,18,592.93 కోట్లకు చేరింది. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 10శాతం మేర కుంగాయి. మార్కెట్ అస్థిరతను సూచించే విక్స్ ఇండెక్స్ ఏకంగా 57శాతం పెరిగింది.

**మార్కెట్ పతనానికి కారణాలివే..**

ట్రంప్ టారిఫ్‌ల దెబ్బతో ప్రపంచవ్యాప్తంగా అనేక మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడింది. సోమవారం ఆసియా, ఐరోపా సూచీలు భారీ నష్టాలను చవిచూస్తున్నాయి. జపాన్ నిక్కీ 7శాతం మేర నష్టాల్లో ఉంది. గత వారాంతంలో అమెరికా మార్కెట్లు కూడా భారీగా కుదలేయ్యాయి. సోమవారం కూడా వాల్‌స్ట్రీట్‌లో తీవ్ర నష్టాలు తప్పవని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ట్రంప్ టారిఫ్‌లతో ద్రవ్యోల్బణం పెరిగి.. కార్పొరేట్ లాభాలు తగ్గొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇది వినియోగదారుల సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపొచ్చు. ఫలితంగా ఆర్థిక వృద్ధి నెమ్మదించే అవకాశాలున్నాయి. దీంతో మాంద్యం భయాలు నెలకొన్నాయి. అమెరికాతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం నెలకొనే అవకాశాలను జేపీ మోర్గాన్ 40 శాతం నుంచి 60 శాతానికి పెంచింది. ఇప్పటికే 180కి పైగా దేశాల నుంచి ట్రంప్ సర్కారు బేస్ టారిఫ్ అయిన 10శాతం సుంకాలను వసూలు చేస్తోంది. వాణిజ్య లోటు పరిష్కారమయ్యే వరకు సుంకాలపై వెనక్కి తగ్గేది లేదని అమెరికా అధ్యక్షుడు మరోసారి స్పష్టంచేశారు. దీంతో మదుపర్లలో ఆందోళన నెలకొంది.ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో ఏప్రిల్‌లో ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. ఈ నెలలో ఇప్పటివరకు రూ.13,730 కోట్ల విలువైన ఈక్విటీలను ఎఫ్‌పీఐలు విక్రయించారు. ట్రంప్ యంత్రాంగంతో భారత్ డీల్ కుదుర్చుకోకపోతే.. ఈ అమ్మకాలు మరింత ఎక్కువగా ఉండొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఈ నెలలో కంపెనీలు దిగ్గజ త్రైమాసిక ఫలితాలను ప్రకటించనున్నాయి. దీనికి తోడు, ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధాన సమీక్ష కూడా ప్రారంభమైంది. ఏప్రిల్ 9న ఆర్‌బీఐ తమ నిర్ణయాలను వెల్లడించనుంది. ఈ పరిణామాలపై దృష్టిపెట్టిన మదుపర్లు విక్రయాలకు మొగ్గు చూపారు. దీంతో మార్కెట్లు బేర్‌మన్నాయి.

## రేపు ఇందిరా పార్క్ వద్ద ఎమ్మెల్సీ కవిత దీక్ష.. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహ ఏర్పాటుకు డిమాండ్



హైదరాబాద్: అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం నాడు దీక్ష చేపట్టనున్నారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించనున్న ఈ దీక్ష ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో ఇందిరా పార్క్ వద్ద ఏర్పాట్లను సోమవారం నాడు తెలంగాణ జాగృతి నాయకులు నవీన్ ఆచారి, యూపీఎఫ్ కో కన్వీనర్ బొళ్ల శివ శంకర్ పరిశీలించారు. బీసీల ఆత్మ బంధువు అయిన మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ చాలాకాలం నుంచి ఎమ్మెల్సీ కవిత పోరాటం చేస్తున్న విషయం విదితమే. పలు సార్లు ధర్నాలు, దీక్షలు నిర్వహించడమే కాకుండా విగ్రహ ఏర్పాటు ఆవశ్యకతపై పలు జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను రెండు సార్లు కలిసి వినతి పత్రాలు కూడా అందించారు. అయినప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో పోరాటాన్ని ఉధృతం చేశారు. విగ్రహ ఏర్పాటుపై ఈ నెల 11న పూలే జయంతిలోగా స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కాగా, ఇందిరా పార్కు వద్ద ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం బొళ్ల శివ శంకర్ విలేకరులతో మాట్లాడుతూ.. బీసీల విషయంలో ప్రభుత్వం చిన్న చూపు తగదని సూచించారు. బీసీల ఆరాధ్య దైవమైన పూలే విగ్రహాన్ని చట్టసభల ఆవరణలో ఏర్పాటు చేసి గౌరవించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ ను ప్రభుత్వం విస్మరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నాయకత్వంలో పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. బీసీల అంశాలు, సమస్యలపై అనేక జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహించామని, వివిధ రూపాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని వివరించారు. బీసీలను మోసం చేస్తూ సహించేదే లేదని హెచ్చరించారు. ఎమ్మెల్సీ కవిత దీక్షకు వేలాది మంది ప్రజలు, బీసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

## ఏఐ గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు ఉందా?.. మన్నె క్రిశాంక్ ధ్వజం

హెచ్‌సీయూ అంశంలో సోషల్‌మీడియాలో తప్పుడు వార్తలు సర్క్యులేట్ చేస్తున్నారని ఆరోపిస్తూ గచ్చిబౌలి పోలీసులు తనకు నోటీసులు పంపించడంపై బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిశాంక్ స్పందించారు. కాంగ్రెస్ డ్యామేజ్ కంట్రోల్ చేయడం ప్రారంభించిందని తెలిపారు. తాను చేసిన పోస్టుల్లో ఎక్కడా కూడా ఏఐని వాడలేదని స్పష్టం చేశారు. ఇటీవల హెచ్‌సీయూ విడుదల చేసిన ఫొటోలు, వీడియోలు అన్నీ వాస్తవమే అని పేర్కొన్నారు. దీనిపై న్యాయపరంగా ఎదుర్కొంటామని చెప్పారు.జింకలు ఎందుకు రోడ్ల మీదకు వచ్చాయి.. ఇళ్లలోకి ఎందుకు వెళ్లాయి.. అవన్నీ వీడియోలు ఉన్నాయని క్రిశాంత్ తెలిపారు. అక్కడ జింకలు లేవు, నక్కలు ఉన్నాయని అంటున్నారని విమర్శించారు. కంచె గచ్చిబౌలి భూముల్లోకి ఎవరూ రావవద్దని ఆంక్షలు పెట్టారని.. ఇప్పుడు ఏఐతో వీడియోలు సృష్టించారని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. అసలు ఏఐ గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు ఉందా అని ప్రశ్నించారు. నిజంగానే అక్కడ జింకలు, నెమ్మళ్లు ఉన్నాయని జాతీయ స్థాయిలో నిరూపితమైందని తెలిపారు. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం తనపై నాలుగు కేసులు పెట్టిందని విమర్శించారు.జింకలు చనిపోవడానికి కారణమెవరు? ఆ చెట్లను నరకడానికి కారణం ఎవరని మన్నె క్రిశాంక్ ప్రశ్నించారు. వీటికి కారణం ఎవరైనా వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అక్కడ జింకలు లేవని అందరితో వీడియోలు పెట్టిస్తున్నారని.. ఒక్కొక్కరికీ రూ.20 వేలు ఇచ్చి రీల్స్ చేయిస్తున్నారని మండిపడ్డారు.

## యువతకు సాఫ్ట్‌స్కిల్స్‌ట్రైనింగ్: మంత్రి శ్రీధర్ బాబు

మొదటిపేజీ తరువాయి

యువతలో ప్రతిభకు కొదవ లేదని.. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్మెంట్ లో శిక్షణ అందిస్తే మరింత మెరుగ్గా తయారవుతారన్నారు. పరిశ్రమలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ కోర్సుల రూపకల్పనలో పరిశ్రమలను భాగస్వామ్యం చేయాలని సూచించారు.

డిమాండ్ ఎక్కువగా ఉన్న కోర్సులపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు సాఫ్ట్ స్కిల్స్ లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. కోర్సు పూర్తయ్యే నాటికి అభ్యర్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ విద్యా, పరిశోధన, టాస్క్, డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ(డీఈఈటీ) తదితర సంస్థలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, డిప్యూటీ సెక్రటరీ భవేష్ మిశ్రా, స్కిల్ యూనివర్సిటీ వీసీ సుబ్బారావు, ఓఎస్డీ చమాన్ మెహతా తదితరులు పాల్గొన్నారు.

## కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై హైకోర్టులో ప్రభుత్వం పిటిషన్

మొదటిపేజీ తరువాయి

**ప్రభుత్వ తరపున సుప్రీంకోర్టు న్యాయవాది మేనక గురుస్వామి వాదనలు వినిపించారు.**

**మొత్తం 400 ఎకరాలకు సంబంధించిన నకిలీ కంటెంట్ రూపొందించారని కోర్టుకు తెలియజేశారు.**

హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కృత్రిమమేధ సాయంతో నకిలీ వీడియోలు సృష్టించి ప్రచారం చేశారని పిటిషన్‌లో పేర్కొంది. ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టు న్యాయవాది మేనక గురుస్వామి వాదనలు వినిపించారు.

మొత్తం 400 ఎకరాలకు సంబంధించిన నకిలీ వీడియోలు, ఆడియో క్లిప్పింగ్స్ తయారు చేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. భూమిని చదును చేసే క్రమంలో బుల్డోజర్లను చూసి జింకలు, నెమళ్లు పారిపోతున్నట్లు నకిలీ వీడియోలు సృష్టించారని పిటిషన్‌లో పేర్కొంది. నకిలీ వీడియోలు సృష్టించిన వారిపై తగిన చర్యలు తీసుకునేలా ఆదేశించాలని ప్రభుత్వం న్యాయస్థానాన్ని కోరింది. పిటిషన్‌పై ఏప్రిల్ 24న వాదనలు వింటామని హైకోర్టు వెల్లడించింది.

## జీఆర్ఎంబీ సమావేశం.. గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై చర్చ

మొదటిపేజీ తరువాయి

గోదావరి నదీ యాజమాన్యబోర్డు ఛైర్మన్ ఏకే ప్రధాన్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని జలసౌధ వేదికగా గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశం జరిగింది.

హైదరాబాద్: గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) ఛైర్మన్ ఏకే ప్రధాన్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని జలసౌధలో జీఆర్ఎంబీ సమావేశం జరిగింది. ఏపీ ప్రభుత్వం తలపెట్టిన గోదావరి – బనకచర్ల ప్రాజెక్టు గురించి తెలంగాణ ప్రస్తావించింది. ఏపీ ప్రభుత్వం సమాచారం, వివరాలు దాచిపెడుతోందని తెలంగాణ అధికారులు ఆరోపించారు. ప్రాజెక్టు అంశంపై బోర్డుకు కేంద్రం నుంచి లేఖ వచ్చి 5 నెలలు గడిచాయని, కేంద్రం నుంచి లేఖలు వచ్చినా తమకు కనీస సమాచారం ఇవ్వలేదని అన్నారు. బనకచర్ల ప్రాజెక్టు పూర్తి వివరాలు, దానివల్ల తెలంగాణపై ప్రభావం తదితర వివరాలు ఏపీ ప్రభుత్వం అందించాలని తెలంగాణ అధికారులు బోర్డును కోరారు.

అనుమతులు లేకుండా ప్రాజెక్టు చేపడుతున్నారని తెలంగాణ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఏపీ అధికారులు బనకచర్ల ప్రాజెక్టుకు ఇంకా డీపీఆర్ తయారు చేయలేదని వివరణ ఇచ్చారు. మరోవైపు పెదవాగు ప్రాజెక్టు ఆధునీకరణ పనులపై సమావేశంలో చర్చించారు. రూ.15 కోట్లతో తక్షణ మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జీఆర్ఎంబీ కార్యదర్శి అజగేషన్ వ్యవహార శైలిని తెలంగాణ అధికారులు ప్రస్తావించారు. రాష్ట్రాలను సంప్రదించకుండానే బోర్డు సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా జీఆర్ఎంబీలో డిప్యుటేషన్‌పై పని చేస్తున్న ఏపీ, తెలంగాణకు చెందిన అధికారులను అజగేషన్ వేధిస్తున్నారని, మహిళా ఉద్యోగులను అసభ్యకర మాటలతో దూషిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ నీటి పారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు తదితర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణకు వర్ష సూచన.. తొమ్మిది జిల్లాలకు ఎల్లో అలెర్ట్..



రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం నుంచే భానుడు ప్రతాపం చూపుతుండడంతో బెంబేలెత్తిపోతున్నారు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లాలంటేను జంకుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రజలకు వాతావరణశాఖ తీపికబురు చెప్పింది. రాగల మూడునాలుగు రోజులు రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. దక్షిణ మధ్య బంగాళాఖాతం మధ్య ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడిందని పేర్కొంది. రాగల 24గంటల్లో బంగాళాఖాతంలో వాయువ్య దిశగా పయనించనున్నది.

అనంతరం 48గంటల్లో పశ్చిమ మధ్య బంగాళాఖాతానికి చేరుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఇవాళ రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేసింది. మంగళవారం, బుధవారాల్లో రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. అలాగే, ఈ నెల 13 వరకు రాష్ట్రంలో పలుచోట్ల అక్కడక్కడ వానలు పడే ఛాన్స్ ఉందని చెప్పింది.

## భూ లోసుగులను కాసులుగా మార్చుకుంటున్న

# మెట్టుపల్లి భూముల బేరగాళ్ళ నేరగాళ్ల

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**

**- అమాయకులే టార్గెట్**
**- సమస్యలే ఆదాయ వనరులు**

కోరుట్ల నియోజక వర్గంలోని ఒకనాటి ఊరు మెట్టుపల్లి క్రమంగా మున్సిపల్ నగరంగా ఎదిగింది.మెట్టుపల్లికి శివారు భూమి తక్కువగా ఉంది. భూ విస్తీర్ణం పరిమితంగా ఉంటుంది. మెట్టుపల్లి ఒకనాడు జాగీరు గ్రామం.మెట్టుపల్లిలో మొత్తం 1546 సర్వే నంబర్లతో దాదాపు 2500 ఎకరాల భూమి మాత్రమే మెట్టుపల్లి శివారుగా ఉంది. పక్క గ్రామాలు వెంకట్రావుపేట,రేగుంట కూడా అప్పటి మెట్టుపల్లి గ్రామ పంచాయతీ లో భాగం అయినా ఈ గ్రామాలకు సెపరేటు పహానీలుండేవి.మెట్టుపల్లితో పాటు ఫకీర్ కొండాపూర్ కూడా ఒక జాగీరు.ఫకీర్ కొండాపూర్ కు 1300 సర్వే నంబర్లతో శివారు ఉంది.మెట్టుపల్లి ప్రధాన రహదారిలో ఉండడంతో పట్టణ శోభ సంతరించుకున్నది. భూముల లభ్యత తక్కువగా ఉండటంతో భూముల డిమాండ్ పెరిగింది.ఇక్కడే భూ దందా చిన్నపాటి మాఫియా రూపం తీసుకున్నది.మెట్టుపల్లికి పక్క గ్రామాలనుండి వలస పెరగడంతో రియల్ ఎస్టేట్ బూమ్ పెరిగింది.ఈ నయా భూ వ్యాపారులకు ఒక తహసిల్దార్ సలహాదారుగా కొత్తగా చట్ట లొసుగుల సమాచారం అందడం మొదలయ్యింది.

**- దారి తప్పిన అధికారుల ఆశలు అక్రమార్కులను పెంచి పోషించాయి**

గతంలో మెట్టుపల్లి లో పనిచేసి రిటైర్ అయిన ఒక తహసిల్దార్ తనకు గల రెవెన్యూ విషయాల అవగాహనను సొమ్ము చేసుకోవాలని కొత్త కొత్త వివాదాలు సృష్టించేవాడు.
తన ఆలోచనలను ఆచరణలో పెట్టడానికి ఒక శిష్యుణ్ణి సృష్టించుకొని భూవివాదాలు ఎలా ప్రారంభించాలో శిక్షణ ఇచ్చి ఊరిపైకి వదిలాడు.
ఆ సదరు శిష్యుడు తన దుడుకుతనానికి ఒడ్డూ పొడుగు ఉన్న ఓ ఇద్దర్ని వెంటేసుకుని భూ సమస్యలు పుట్టించి బేరాలు చేసేవారు.
ఒకవైపు బలహీనమైన పార్టీతో సమస్యలో దూరి




పరిష్కార వేత్తగా అవతారమెత్తి అగ్రిమెంట్ లో దూరి ఎదుటి పక్షాన్ని ఇబ్బంది పెట్టడంతో పాటు ఒక పస లేని కేసు హైకోర్ట్ లో ఫైల్ చేసి స్టే తెచ్చి కాలహరణ చేయడం ఒక కళగా, మెలుకువగా మార్చి సంపాదించడం వీరి వృత్తిగా మార్చుకున్నారు.
ఈ సమస్య ఎందుకు అని తన తాబేదారును రంగంలోకి దించి పంచాయతీ పెట్టించి ఇద్దరి నుండి భూమిని కొనుగోలు ఒప్పందం చేసుకుని అమ్ముకోవడం అనే పద్ధతిని అనుసరించారు.
లేదా ఒకరి నుండి ఒప్పందం చేసుకుని ఎదుటి పక్షం వ్యక్తిని నయానా భయానా లొంగదీసుకుని భూములు కొట్టేయడం చేయడం వీరి పని విధానం.
ఈ మొత్తం వ్యవహారంలో సదరు రిటైర్డ్ తహసిల్దార్ ఈ శిష్యునికి రెవెన్యూ లొసుగులను వెతికి చూపించి లాభం చేకూర్చి వాటా పొందేవాడు.
ఈ సదరు శిష్యుడు ఎవరు అధికారంలో ఉంటే వారి పక్షాన తన అనుచరునితో సహా అధికార పక్షం నాయకుని వెంట తిరగడం, తన భుజాల పై చేయి వేయించుకుని ఫోటోలు దిగి ఫేస్ బుక్ లో,వాట్సప్ లో పెట్టుకుని బతకడం, తన కార్య సాధన కొరకు అన్ని పార్టీల కండువాలు జేబులో పెట్టుకుని తిరగడం వీరి శైలి.

**- ఇంకొక ముఠా**

ఈ శిష్యునికి అనుచరుడిగా ఉన్న వ్యక్తి ఈ మెలుకలవలు నేర్చుకుని అతనే ఇంకొక ముఠా తయారు చేసుకున్నాడు.ఇతనికి మెట్టుపల్లి కి చెందిన ఒక నాన్ క్వాలిఫైడ్ డాక్టర్ ను గురువుగా స్వీకరించి, ఒక మాజీ మున్సిపాలకున్ని కలుపుకుని ఊరిపై పడి తిరగడం, సమస్యలలో ఉన్న భూములను వెదికి వివాదాల్లోకి దూరడం వీరికి ఒక వ్యాపకం,వ్యాపారం.
ఈ సదరు నాన్ క్వాలిఫైడ్ డాక్టర్ తనకు గల సంబంధాల నుండి లాభాలను పిండుకోవడం ఒక సంపాదనా మార్గంగా మార్చుకున్నాడు.
మెట్టుపల్లిలో ఎవరైనా భూమి కొని తిరిగి అమ్మే ప్రయత్నం చేస్తున్నారని తెలియగానే, ఈ డాక్టర్ కు తెలిసిన వ్యక్తి దగ్గరికి వెళ్ళి,లేదా కలిసినప్పుడు మాటలు కలిపి భూమి కొన్నావట గద, నాకు ఓ ప్లాటు,లేదా రెండు ప్లాట్లు కొన్న ధరకు ఇవ్వు అని మర్యాదగా అడిగి తన పరిచయాన్ని, సాన్నిహిత్యాన్ని ఎరగా వేయడం ఒక ప్రక్రియగా మార్చుకున్నాడు.
తన సంబంధాన్ని ఉపయోగించి బేరాలాడుతాడు. బేరం కుదరక పోతే సమస్య సృష్టించడమే ఇతని కార్య పద్ధతి. సమస్య ఇక నేర దారికి మళ్లించడమే వీరి వృత్తి.
ఆ సదరు వ్యక్తి కూడా లాభం కొరకు కొంటాడు కాబట్టి తనకు పద్ద రేటుకు ఈ డాక్టరుకు ఇవ్వడానికి వెనకా ముందులాడతాడు.
బేరం కుదరక పోతే, ఈ డాక్టరు ఇక తన ముఠా సభ్యుడైన కౌన్సిలర్ ను మున్సిపల్ పైకి వదలి మున్సిపల్ అధికారులను భూమి యజమాని దగ్గరికి పంపుతాడు.
ఈ భూమికి లే ఔట్ పర్మిషన్ ఉందా,ఎలా భూమిని చదును చేస్తున్నారు? ప్లాట్లు ఎలా అమ్ముతారు అని అక్కడ పని చేసే మనుషులపై అధికారులతో,సిబ్బందితో ఒత్తిడి చేయిస్తాడు.
20 గుంటల స్థలం కంటే తక్కువ భూమి ఉన్నప్పుడు లే ఔట్ పర్మిషన్ అవసరం ఉండదు. ఇది మున్సిపల్ మాన్యువల్ లో ఉన్న విషయం. కానీ ఈ విషయం తెలియని అమాయక భూమి కొనుగోలు దారుడు రాజీ మార్గానికి వస్తాడు.
అప్పుడు మాజీ మున్సిపాలకున్ని రంగంలోనికి దించి,పెద్ద మనిషిగా చూపించి,నమ్మించి మున్సిపల్ అధికారులను శాంతింప జేసి భూ సమస్య ఉన్న వ్యక్తి నుండి డబ్బు పిండుకుని ఈ ముఠా తమ శ్రమకు తగిన కూలీ వసూలు చేసుకుని పొట్ట నింపుకుంటారు.

**- ఈ వ్యవహారమంతా గుట్టు చప్పుడు కాకుండా పూర్తవుతుంది**

ఇలా మెట్టుపల్లిలో ఈ డాక్టర్ మాదిరిగానే ఇంకా కొందరు భూ మాఫియాలుగా మారి భూ పంచాయతీల్లో దూరి, రోడ్డెక్కి హింసా మార్గం వైపు సమస్యలను మళ్లించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి.ఈ గొడవలు కొన్ని లా అండ్ ఆర్డర్ సమస్యగా మారి చివరికి పోలీస్ స్టేషన్ కు కూడా చేరిన సందర్భాలు ఎన్నెన్నో ఉన్నాయి.

**- ఈ అనధీకృత డాక్టర్ ఒక అపరిచిత అవతార మూర్తి**

ఈ సదరు డాక్టర్ తనకు తానే ఒక ప్రభావ శీలిగా ప్రకటించుకుంటాడు. భూ సమస్యలున్న వ్యక్తులను తన కూలీ మనుషులతో తన దగ్గరికి పిలిపించుకుని సమస్య ఏమిటని అడిగి మీ రెవెన్యూ సమస్యను నేను పరిష్కారం చేయించి పెడతానని నమ్ముతాడు.తహసీల్దార్ నా మనిషి అని ఆ సమస్య తాలూకు వ్యక్తి ముందర తహశీల్దార్ కు ఫోన్ క్షేమ సమాచారాలు మాట్లాడి తహసీల్దార్ తనకు దగ్గర అని అనిపించేటట్టు నమ్మిస్తాడు.సార్ మిమ్మల్ని కలుస్తాను అని సమస్య ఉన్న వ్యక్తి ముందర మాట్లాడి నమ్మకం పెంచుతాడు.తహసీల్దార్ పేరు చెప్పి సదరు సమస్య ఉన్న ఒక వ్యక్తి నుండి లక్షల్లో డబ్బు తీసుకుని పని చేయించకుండా కాల హరణం చేయడం వల్ల ఈ విషయం, మెట్టుపల్లిలో మెల్ల మెల్లగా అందరికీ తెలిసింది.పని ఇంకా ఎప్పుడు అవుతుందని ఈ సమస్య ఉన్న వ్యక్తి గుడి చుట్టూ ప్రదక్షిణాలు చేసినట్టు ఈ డాక్టర్ చుట్టూ తిరగడం, తిరిగి తిరిగి అలసిపోయి డైరెక్ట్ గా వెళ్ళి ఆ తహసీల్దార్ ను కలిసాడు.సార్ నేను మీకు పలానా పని విషయంలో డబ్బులు ఇచ్చాను, నా పని కొద్దిగా చేసిపెట్టండని అడగడం అడగడం జరిగింది.దానికి కోపగించుకున్న తహసిల్దార్ ఎవరికి ఇచ్చావు, ఆ వ్యక్తికి నాకు సంబంధం ఏమిటి అని ఈ సమస్య ఉన్న వ్యక్తిని తహసిల్దార్ కోప్పడ్డాడు.ఆ డాక్టర్ తహసీల్దార్ పేరు చెప్పి, తనకు తహసీల్దార్ దగ్గర పరపతి ఉందని నమ్మించి డబ్బు తీసుకున్నాడని రూఢీ చేసుకుని ఈ అనధీకృత డాక్టర్ దగ్గరికి వచ్చి నిలదీయడంతో విషయం బజారు కెక్కింది.తహసీల్దార్ దగ్గరికి నడువు అని సదరు బాధిత వ్యక్తి మనుషులు డాక్టర్ ను నిలదీస్తే పొంతన లేని కారణాలు చెప్పడంతో ఈ డాక్టర్ కు దేహ శుద్ధి చేశారు.ఆ తహసీల్దార్ ట్రాన్స్ఫర్ లో ఉన్నాడన్న విషయం ఈ డాక్టర్ కు తెలుసు.తహసీల్దార్ ట్రాన్స్ ఫర్ అయితే తహసీల్దార్ పై నెపం నెట్టి డబ్బులు మిగుల్చుకోవచ్చని మేధావి డాక్టర్ ఎత్తులు వేసాడు.ఈ బదిలీ విషయం తెలుసుకున్న పట్టు వదలని సదరు భూమి యజమానులు డబ్బు కొరకు డాక్టర్ ను వదలకుండా మళ్ళీ ఒకసారి డాక్టర్ కు బాడీ మసాజ్ చేసారు.చివరికి మసాజ్ ట్రీట్ మెంట్ పని చేసి బాధిత భూ యజమానికి డబ్బులు వాపస్ చేశాడు ఈ డాక్టర్.ఇంతటితో ఈ ఒక్క సమస్య మాత్రం పరిష్కారమైంది. వెలుగు చూడని సమస్యలు ఎన్నో ఉన్నాయి. బాధ చెప్పుకోలేని నిస్సహాయులు ఇంకా ఎందరో మౌనంగా బలై పోయారు.

**- రేవంత్ ప్రభుత్వ అక్రమ లే ఔట్ క్రమబద్ధీకరణ అనుమతితో తాత్కాలికంగా ఈ అక్రమార్జన పరుల ఆటలకు చెక్ పడింది**

చట్టం సమర్థ వంతంగా ఉంటే,అమలు చేసే అధికారులు నీతిగా న్యాయంగా పనిచేస్తే ఈ మాఫియాలు ఉద్భవించరు.పాలన అలసత్వం లోకి జారుకుంటే,సంఘ విద్రోహులు విజృంభిస్తారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం కల్పించిన లాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ ను ఉపయోగించుకుని భూములు కొన్నవారు తమ స్థలాలను రెగ్యులరైజ్ చేసుకుని దర్జాగా ఉండాలి.ఇంకా ఎవరైనా ఈ అక్రమార్కులు వేధిస్తే,బెదిరిస్తే అది లా అండ్ ఆర్డర్ సమస్య అవుతుంది.కాబట్టి పోలీసుల సహాయం కోరవచ్చు.మానాభిమానాలకు భయపడి మౌనంగా ఉంటే సంఘ విద్రోహులను ప్రోత్సహించినట్టే అవుతుంది.చట్టమే గొప్పది, చట్టం ముందు ఎవ్వరూ గొప్పవారు కాదు.

## యువజన కాంగ్రెస్ విద్యార్థిని, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ




**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 7**
యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు ఆధ్వర్యంలో జమ్మికుంట మండలంలోని మాచనపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో 6,7,8 తరగతులు తదువుతున్న విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, స్కెల్ విద్యార్థులకు ఉపయోగపడే పలు వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా పర్లపల్లి నాగరాజు మాట్లాడుతూ చదువుతోనే బంగారు భవిష్యత్తు కు బాటలు వేసుకోవచ్చని విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని అని అన్నారు. అదే విధంగా కరీంనగర్ జిల్లాలోనే అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు.ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థులను ప్రోత్సహించే విధంగా బహుమతులు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి ఉమ్మడి సందీప్, కాంగ్రెస్ నాయకులు గుర్రపు సంపత్ రెడ్డి, బండ రజిని రెడ్డి, ప్రధానోపాధ్యాయులు వేణు మాధవ్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఈశ్వర్ కృపా వృద్ధాశ్రమంలో దీప్తి మహిళా సమితి సంక్షేమ కార్యకలాపాలు

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
దీప్తి మహిళా సమితి సంక్షేమ కార్యక్రమాల కింద ఎన్టీపీసీ రామగుండం సమీపంలోని గ్రామంలో ఉన్న ఈశ్వర్ కృపా వృద్ధాశ్రమాన్ని సోమవారం సందర్శించారు. ఈ కార్యక్రమం అధ్యక్షురాలు రాఖీ సమంత నేతృత్వంలో వృద్ధులకు పరుపులు, దిండ్లు, బెడ్‌షీట్లు, దిండు కవర్లు, అవసరమైన ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. నివాసితులు దీప్తి మహిళా సమితి సభ్యులతో హృదయపూర్వకంగా సంభాషించినప్పుడు వృద్ధాశ్రమం నవ్వులు, హృదయపూర్వక సంభాషణలతో సజీవంగా మారింది. ఈ కార్యక్రమంలో జ్యోత్సన త్రిపాఠి, ఇన్-చార్జ్ బాల్ భవన్, రూపా సింఘా రాయ్, ఇతర సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.

## పరస్పర సంబంధాన్ని ప్రోత్సహించడమే

# ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ లక్ష్యం

**ఆకుల రంజిత్,కరపత్రం ప్రతినిధి**

**- ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి**
పరస్పర సంబంధాన్ని ప్రోత్సహించడమే “ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్” లక్ష్యం అని ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.సోమవారం ఇబ్రహీంపట్నం మండలం లోని కోమటికొండాపూర్ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల కోమటి కొండాపూర్ లో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం ను ఘనంగా నిర్వహించారు.ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ దేశం లోని వివిధ ప్రాంతాల సాంస్కృతిక



కోమటి కోండాపుర్ లో పాఠశాల లో కార్యమం నిర్వహిస్తున్న దృశ్యం

సంబందాలను బలోపేతం చేయడం, మరియు వివిధ రాష్ట్రాలలో నివసించే ప్రజల మధ్య పరస్పర సంబందాలను ప్రోత్సహించడం ఈ కార్యక్రమ లక్ష్యం అని తెలిపారు.దీంట్లో భాగంగా మన తెలంగాణ విద్యార్థులు హర్యానా రాష్ట్ర భాష, సంస్కృతి, జీవనశైలి లను తెలుసుకోవలసి ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో ఇ.బి.ఎస్.బి భాద్యులు రాసూరి రాణి, నర్మద, సుధారాణి, విశాల్, జ్యోష్ణ, మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన సద్వినియోగం చేసుకోవాలి

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఏప్రిల్ 07:**
ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఎసి) జె.అరుణ శ్రీ అన్నారు. ఇటీవల మరణించిన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడు కొట్టె ప్రసాద్ కుటుంబానికి ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం కింద ఎస్బిఐ లైఫ్ భీమా సంస్థ జారీ చేసిన రూ.2 లక్షల చెక్కును రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సంధర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న ఈ బీమా పథకాలలో పారిశుద్ధ్య కార్మికులు, ఆర్పిలు ప్రతి ఒక్కరూచేరాలని అన్నారు. దురదృష్టవశాత్తు వ్యక్తి దూరమయినప్పటికీ బీమా సొమ్ము ఆదుకుంటుందని అన్నారు. మరణించిన పారిశుద్ధ్య కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పిస్తున్నామని అన్నారు. ఈ సంధర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ రవీందర్ సింగ్, బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ భీమా పథకం ప్రయోజనాలను వివరించారు. ఏడాదికి రూ 436 చెల్లిస్తే రూ.2 లక్షల భీమాతో పాటు మరో రూ.20 అదనంగా చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా కూడా వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, సానిటరీ ఇన్స్పెక్టర్ కుమారస్వామి, సిబ్బంది వసుధ, శంకర్, పారిశుద్ధ్య కార్మిక సంఘం నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు, మంథని లింగయ్య, రాయమల్లు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ లో రామగుండం నగరం ఉత్తమ ర్యాంకు సాధించేందుకు పౌర స్పందనలో ఫీడ్ బ్యాక్ ఎక్కువ మంది ఇవ్వాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఎసి) జె.అరుణ శ్రీ కోరారు. ఈ మేరకు మెప్మా ఆర్పిలతో సోమవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ లో పౌర స్పందనకు కూడా మార్కులు కేటాయించిన%శీ%దున ఎక్కువ మంది ఫీడ్ బ్యాక్ ఇస్తే మార్కులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. ఆన్ లైన్ లో ఫీడ్ బ్యాక్ నమోదు చేయడానికి మరో నాలుగు రోజులు గడువు ఉన్నందున స్వశక్తి మహిళలకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకట స్వామి, సానిటరీ ఇన్స్పెక్టర్ కుమార స్వామి, మెప్మా టిఎంసి మౌనిక, సిఓలు, ఆర్పిలు పాల్గొన్నారు.

# అర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శికి సన్మానం

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**




అర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి,ఢిల్లీ బీజేపీ అధ్యక్షులు వీరేంద్ర సచ్ దేవాను ఆయన నివాసంలో ఆదివారం జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు,ఎథిక్స్ డిసిప్లేన్ కమిటీ చైర్మన్ గా నూతనంగా ఎన్నుకోబడిన ఈగ సంజీవరెడ్డి తెలంగాణ అర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అయిన పి.అరవింద్ కుమార్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈవెంట్ కమిటీ సభ్యుడిగా నియామకమైన సందర్భంగా సచిదేవాను కలిసి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా అర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి, ఢిల్లీ బిజెపి అధ్యక్షుడు వీరేంద్ర సచ్ దేవా మాట్లాడుతూ,నూతనంగా ఎన్నుకోబడిన ఈగ సంజీవరెడ్డిని మరియు పి. అరవింద్ కుమార్ ను అభినందించారు. క్రీడాకారులను, క్రీడాలను ప్రోత్సహించాలని, క్రీడాకారులకు కావాల్సిన వసతులు కల్పించాలని సూచించారని తెలిపారు.ఈ సన్మాన కార్యక్రమం లో అర్చరీ ఫెడరేషన్ అఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి గుంజన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత అంబలి పంపిణీని ప్రారంభించిన కలెక్టర్





**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం(టీఎన్జీఓ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లో నెలకొల్పిన ఉచిత అంబలి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం లాంచనంగా ప్రారంభించారు.చల్లని తాగునీటితో పాటు ఉచితంగా అంబలి పంపిణీకి చొరవ చూపడం అభినందనీయమని టీఎన్జీఓ సంఘాన్ని అభినందించారు.ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ,సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయం అని అన్నారు. కలెక్టరేట్ ఉద్యోగులతో పాటు వివిధ పనుల కోసం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయానికి వచ్చే వారికి ప్రస్తుత వేసవిలో అంబలి కేంద్రం ఎంతో ఉపశమనాన్ని అందిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు సుమన్,కార్యదర్శి శేఖర్,రాష్ట్ర నాయకుడు గైని గంగారాం తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడలో అంబలి కేంద్రాన్ని ప్రారంభించిన పోచారం, కాసుల

**కరపత్రం బాన్సువాడ ఏప్రిల్ 07**




బాన్సువాడ పట్టణంలోని ప్రముఖ వ్యాపారవేత్త నాగులగామ వెంకన్న గుప్తా తన తండ్రి నాగులగామ గిర్మయ్య గుప్త జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన అంబలి, చలివేంద్ర కేంద్రాన్ని సోమవారం రాష్ట్ర వ్యవసాయ సలహాదారు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాపార రంగంలో రాణిస్తూ 26 సంవత్సరాలుగా ప్రజలకు వేసవిలో చల్లటి నీరుతోపాటు అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని, పేద ప్రజల కడుపు నింపుతున్న వ్యాపారవేత్త వెంకన్న గుప్తను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నార్ల సురేష్ గుప్తా,సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, వ్యాపారవేత్త నాగుల రామ వెంకన్న గుప్తా, నిఖిల్ గుప్తా, నాయకులు ఎజాస్, నర్సుగొండ, సాయగౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ రాముల వారి పట్టాభిషేకం...








**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**

శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నిజామాబాద్ జిల్లాలోని మోస్రా మండల కేంద్రంలో గల శ్రీ రామ మందిరంలో సోమవారం శ్రీరాముల వారి పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా, ఘనంగా నిర్వహించారు. ఆలయ పండితులు శ్రీనివాస్ వేద మంత్రోత్సరణాల నడుమ ఉత్సవ మూర్తులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉత్సవ మూర్తులకు పూల మాలలతో సుందరంగా అలంకరించి పట్టాభిషేకం చేశారు. భక్తులు పట్టాభిషేక మహోత్సవాన్ని ఆనందంగా తిలకించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పట్టాభిషేకం తిలకించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పెద్ద ఎత్తున విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, హనుమాన్ మాల దారులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

# ఎంపీ సురేష్ షెట్కర్ ను సత్కరించిన కాంగ్రెస్ నాయకులు.



**కరపత్రం బాన్సువాడ ఏప్రిల్ 07**

జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కర్ ను సోమవారం ఆయన నివాసంలో బాన్సువాడ నియోజకవర్గ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాసాని శ్రీనివాసరెడ్డి, ఎస్టి జిల్లా కోఆర్డినేటర్ అంబర్ సింగ్, నాయకులు జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 70 ఫిర్యాదులు

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**





ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 70 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్,మెప్మా పీ.డీ రాజేందర్, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డిలకు విన్నవిస్తూ,అర్జీలు సమర్పించారు.కాగా,అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ,సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి... మార్కెట్ కమిటీ చైర్పర్సన్ మంత్రి అంజవ్వ గణేష్

**కరపత్రం బాన్సువాడ ఏప్రిల్ 07**



రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటుచేసిన వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్పర్సన్ మంత్రి అంజవ్వ గణేష్ అన్నారు. సోమవారం బాన్సువాడ మండలంలోని పులికుచ్చ తండాలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వారి ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన సన్న రకం వరి ధాన్యానికి ప్రభుత్వం 500 బోనస్ కల్పించిందని, రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం పద్మ, సొసైటీ డైరెక్టర్ మోహన్ రెడ్డి, ధూప్య నాయక్, సాయిలు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి పార్టీలో చేరిన మైనార్టీ యువకుడు



**కరపత్రం నస్రుల్లాబాద్ ఏప్రిల్ 7**

నస్రుల్లాబాద్ మండలంలోని బసవేపల్లి గ్రామానికి చెందిన మైనార్టీ యువకులు సమీర్ సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు సున్నం సాయిలు ఆధ్వర్యంలో పార్టీలో చేరగా ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యువకుడు సమీర్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ అవలంబిస్తున్న విధానాలకు ఆకర్షిస్తున్నాయి బిజెపి పార్టీలో చేరడం జరిగిందని, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మేకల రాములు, గంగాధర్ గుప్తా, కందీ పెద్ద మల్లేష్, గోపి పవన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# బోధన్ లో కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర...

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**



బోధన్ పట్టణంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు వార్డులలోని ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి పథకాలను వివరించారు. ఈ సందర్బంగా పట్టణ అధ్యక్షులు పాషా, సీనియర్ నాయకులు తూము శరత్ రెడ్డి లు మాట్లాడుతూ ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లు పిలుపు మేరకు మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం ద్వారా ఇంటింటికి తిరిగి భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని పిలుపునిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ ఫలాల గురించి కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆనం పల్లి ఎల్లం, అంకు దాము, హరికాంత్ చారి, తలారీ నవీన్, ఖలీం, సంతోష్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఊట్పల్లి గ్రామంలో జై బాపు, జై భీం, జై సంవిధాన్...



**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**

బోధన్ మండలంలో జై బాపు జై భీమ్ జై సం విధాన్ కార్యక్రమం నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఊట్పల్లి గ్రామంలో మహాత్మా గాంధీ, అంబేద్కర్, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిపీసీసీ డెలిగేట్ గంగా శంకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు నాగేశ్వర్ రావ్, సంజీవ్ రెడ్డి, రవి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు టప్పా సాయిలు, అశోక్ రెడ్డీ, బల్లేపు నర్సయ్య, జమీల్, సుమన్, బోయి తిరుమలేశ్, బి.వెంకటేష్,జి. సాయిలు, చంద్రయ్య కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.